# ఇన్‌స్పెక్షన్




(అదో క్లాసురూం, అప్పుడే ఫస్ట్ పీరియడ్ అయిపోయి, మాస్టారు వెళ్ళిపోవడంతో - పిల్లలు అల్లరి చేస్తూ ఉంటారు.)

క్లాస్‌లీడర్ : సైలెన్స్ ! సైలెన్స్ !

(పిల్లలు ఇంకా అల్లరి చేస్తూనే ఉంటారు)

లీడర్ : బెల్ అయి పది నిముషాలైంది ! సోషల్‌టీచర్ ఇంకా రావట్లేదు! మీరేమో నా దుంపతెంచి గంపకెత్తుతున్నారు!

(రవి అనే అబ్బాయి మరో అబ్బాయితో ముష్టి యుద్ధం చేస్తూ వుంటాడు.)

లీడర్ : ఏయ్ ! రవీ ! నీ కెన్నిసార్లు చెప్పాలి.... మాట్లాడవద్దనీ ? నీ పేరు రాస్తున్నాను ! టీచర్ వచ్చాక చూపిస్తాను! నీ ఇష్టం !

రవి : నీ కెప్పుడూ నామీదే కన్ను! నీ ఫ్రెండ్స్ ఎంత మాట్లాడినా వాళ్ళనేమీ అనవ్! ఒక్కసారి కూడా వాళ్ళ పేర్లు బోర్డుమీద రాయవ్ ! మాష్టారుకి చూపించవ్ ! నేను నోరు విప్పితే చాలు.... కస్సుమంటావ్ ! నువ్వేం లీడర్వి ! బోడి లీడర్వి !

లీడర్ : ఏయ్ మాటలు జాగ్రత్తగా రానీ ! బోడి లీడరేమిటీ... బోడి లీడర్! అసలు ఎరక్కపోయి లీడర్‌నయ్యాను! నాకీ లీడర్షిప్ వద్దూ - నీలాంటి అడ్డమైన వాళ్లతో తిట్లూ వొద్దు! (బయటికి వెళ్ళబోతూ) ఏయ్ వినీతా ! నువ్వు సెకండ్ లీడర్వి కదా ! ఇలా వచ్చి నించో- నేనీలోగా స్టాఫ్‌రూం దాకా వెళ్ళి - మన సోషల్ స్టడీస్ టీచర్ని పిలుచుకొస్తాను!

వినీత : సరే ! (సర్దుకుని తనే ఓ టీచర్లా పోజుపెట్టి) ఇదిగో పిల్లలూ ! సోషల్ స్టడీస్ టీచర్ ఆఫీస్‌లో పనివుందంటూ - ఇప్పట్లో ఎలాగూ క్లాస్‌కి రారు గానీ - అందాకా - నేను ఎంచక్కా మీకో సోషల్ లెసన్ చెప్తాను... వింటారా ?

పిల్లలు : ఓ....

వినీత : ఏయ్ సునీతా! నువ్వు డీయీవోగా వుండాలి !

సునీత : (ముఖం వెలిగిపోతూ) ఏమిటీ ? నేను... డీయీవోనా ? ఎంత అదృష్టం !

రవి : సునీత ఉత్త అల్లరిది ! ఆమె డీయీవోనా ? నో ! మేమొప్పుకోం!

సునీత : ప్లీజ్ రవీ ! నీకు పుణ్యముంటుంది ! ఈ ఒక్కసారికి నన్ను డీయీవోగా వుండనీండి ! మన సోషల్ టీచర్ రోజూ లేట్‌గానే వస్తారుకదా ! కావాలంటే - రేపటి నుండి రోజూ ఈ ఇన్స్‌పెక్షన్ ఆట ఆడుకుందాం! అపుడు మీలో అందరికీ తలా ఓ రోజు డీయీవోగా ఛాన్స్ వస్తుంది!

పిల్లలు : ఒకే ! అగ్రీడ్ ! ఊ - కమాన్ ? ప్రొసీడ్ !

రవి : మరి హెడ్‌మాష్టర్లా ఎవరుంటారు ?

వినీత : థర్డ్ లీడర్ విక్రమ్ వున్నాడు కదా !

రవి : అవునూ.... విక్రమ్ ఏడీ ? ఎక్కడా ?

విక్రమ్ : (కాలర్ సర్దుకొంటూ) ఇదిగో ఇక్కడ !

(విక్రమ్ దర్జాగా లేచి బోర్డ్ ప్రక్కనే వున్న కుర్చీలో కూర్చోవడానికి వెళ్తూంటే - పిల్లలు చప్పట్లతో - కేరింతలు కొడ్తారు)

సునీత : చూడండి పిల్లలూ ! ఈ రోజు 'అక్షాంశాలూ రేఖాంశాలూ' గురించి చెప్పుకుందాం ! ఇదిగో బోర్డ్ మీద ఒక వృత్తం గీస్తున్నాను ! ఇదేమిటై వుంటుందో చెప్పండి చూద్దాం ?

పిల్లలు : గోళం... భూగోళం !

వినీత : కరెక్ట్ ! దీన్ని రెండుగా విభజిస్తూ ఒక రేఖ గీస్తున్నాను.

(వినీత బోర్డుమీద ఆ వృత్తాన్ని రెండు భాగాలుగా చేస్తూ నిలువుగా ఒక గీత గీస్తుంది!)

వినీత : మధ్యలో గీశానే - ఈ గీత - దీనిని భూమధ్యరేఖ అంటారు! దీన్నేమంటారు చెప్పండీ ?

పిల్లలు : భూమధ్యరేఖ !

వినీత : గుడ్ !

రవి : (బెంచీమీద నుండి లేచి) టీచర్, భూమధ్యరేఖ అలా వుండదండీ! ఇలా వుంటుంది ! (రవి బోర్డు దగ్గరికి వెళ్ళి - వృత్తంలో టీచర్ నిలువుగా గీసిన గీతని తుడిపేసి - అడ్డంగా మరో గీత గీస్తాడు)

వినీత : ఎవర్రా నీకు చెప్పింది ? నాకే పాఠాలు చెప్తావట్రా ! ఎమ్మేబిఎడ్ని- నీకు తెలుసా - నాకు తెలుసా? గెటౌట్ !

సునీత ఉరఫ్ డీయివో : (లేచి వెళ్ళబోతూ విక్రమ్ ఉరఫ్ హెడ్ మాస్టర్తో) ఇలాంటి టీచర్స్ని అపాయింట్చేసి - దేశం మీద వదిలిన వాళ్ళనన్నాలి!

ఫస్ట్లీడర్ : (పరుగెత్తుకుంటూ వచ్చి, రొప్పుతూ) డీయీవో జీప్ వచ్చింది ! డీయీవో గారు సర్ప్రైజ్ విజిట్కి వచ్చారట!

(విద్యార్థులంతా ఎక్కడివాళ్ళక్కడ గప్చుప్గా బెంచీలమీద సర్దుక్కూర్చుంటారు)

రవి : (బయటికి తొంగిచూసి) మన సోషల్ స్టడీస్ టీచర్.... అదిగో... అల్లుతోన్న స్వెటర్ అవతల పారేసి - ఎంచక్కా మ్యాప్ తీసుకుని మన క్లాస్కి వచ్చేస్తున్నారోచ్!

సునీత : అవునా ? మ్యాప్తోనా ? అబ్బ ! ఎన్నాళ్ళయిందో మ్యాప్ చూసి! ఓహ్ ! ఈరోజు మన టీచర్సంతా కుర్చీలమీద కూర్చోకుండా- నించునే లెసన్స్ చెప్తారు ! మ్యాప్స్, టీచింగ్ ఎయిడ్స్.... ఒకటేమిటీ... ఎన్నెన్నో... అంతకుముందు మనం ఎప్పుడూ చూడనివి చూపించి - మనకి పాఠాలు చెప్తారు ! ఈ రోజు లెసన్సన్నీ భలే ఇంటరెస్టింగ్గా వుంటాయి !

వినీత : అవును సునీ ! డీయీవోగారు రోజూ ఇలాగే ఇన్స్పెక్షన్కి వస్తే- ఎంత బావుణ్ణు !

(సోషల్ టీచర్ హడావిడిగా ప్రవేశిస్తారు)

పిల్లలు : (లేచి నిలబడి) గుడ్ మార్నింగ్ మేడం !

సోషల్ టీచర్: (విసుగ్గా - కంగారుగా) ఊఁ గుడ్ మార్నింగ్! కూర్చోండి ! కూర్చోండి! డీయీవో వచ్చారు ! నేనిపుడు పాఠం చెప్తాను ! డీయీవోగారు క్లాస్‌కి వస్తే - వారేది అడిగినా జవాబులు చెప్పాలి... తెల్సిందా ?

పిల్లలు : ఓ... చెప్తామండీ !

(ఇంతలో డీయీవో క్లాస్ రూంకి వస్తారు. పిల్లలు లేచి)

పిల్లలు : గుడ్‌మాణింగ్ ! సార్ !

డీయివో : గుడ్‌మాణింగ్ ! కూర్చోండి ! (టీచర్‌ని చూస్తూ) ప్లీజ్ ప్రొసీడ్!

సోషల్ టీచర్: నిన్న మనం నేర్చుకున్న పాఠం 'భారతదేశం - విమానమార్గాలు' (టాపిక్ బోర్డుమీద రాసి) ఆ - ఇపుడు నేను కొన్ని ప్రశ్నలడుగుతూ లెసన్ చెప్తాను ! మీరు జవాబులు చెప్పాలి ! మన దేశంలో ముఖ్యమైన నగరాలు ఏవేవి ? ఫస్ట్ బెంచీ అమ్మాయి... సునీతా... నువ్వు!

సునీత : ఢిల్లీ !

సోషల్ టీచర్: గుడ్ ! కమాన్, సెకండ్ బెంచీ అబ్బాయి - విక్రమ్... నువ్వు!

విక్రమ్ : కలకత్తా !

సోషల్ టీచర్: గుడ్ ! ఇపుడు - థర్డ్ బెంచీ అబ్బాయి - రవీ !

రవి : బాంబే !

సోషల్ టీచర్: వెరీ గుడ్ ! నౌ ఫోర్త్ బెంచ్ గర్ల్ - వినీత !

వినీత : మద్రాస్ !

సోషల్ టీచర్: గుడ్ ! మన దేశంలో విమాన మార్గాలు ముఖ్యంగా ఈ నాలుగు నగరాలనూ కలుపుతాయి ! ఈ పటంలో మీరు ఢిల్లీని చూపించండి! సునీతా... నువ్వు!

(సునీత - వచ్చి చూస్తుంది ! కన్పించదు ! కళ్ళు మిటకరిస్తూ వుంటుంది)

సోషల్ టీచర్: వినీతా... నువ్వు !

(వినీతక్కూడా కన్పించదు)

సోషల్ టీచర్: విక్రమ్.... నువ్వు ?

(విక్రమ్‌కి కూడా కన్పించదు ! నీళ్లు నములుతూ వుంటాడు)

సోషల్ టీచర్: అరే - చవటల్లారా! మీరు మ్యాప్ పాయింటింగ్‌లో ఇంత పూర్ అనుకోలేదు ! ఎవర్రా మీకు సోషల్ చెప్పింది ? భారతీయులైవుండీ- భారత రాజధాని ఎక్కడుందో చెప్పలేక పోతున్నారంటే ఎంత

అవమానం ? ఇదిగో - ఢిల్లీ ఇక్కడ వుంటుంది!

(అంటూ పటం దగ్గరికి వెళ్ళి ఢిల్లీకోసం వెదుకుతాడు. అతడికి ఎక్కడా ఢిల్లీ కన్పించదు ! తత్తరపడి - గుటకలు మింగి - తమాయించుకుని.... ఏదో... ఒకటి చూపించి)

సోషల్ టీచర్: ఇదిగో - ఇక్కడ వుంటుంది ఢిల్లీ ! ఇప్పుడు చెప్పండి ఢిల్లీ ఎక్కడుందో?

రవి : ఇక్కడ వుంది సార్ !

సోషల్ టీచర్: ఇక్కడంటే ఎక్కడా ? నీ బెంచీ దగ్గరా ? వచ్చి ఈ పటంలో చూపించు!

రవి : ఇక్కడ అంటే ఆ పటంలో కాదుసార్ ! (తన దగ్గర వున్న వేరే పటం చూపిస్తూ) ఢిల్లీ ఈ పటంలో వుంది ! మీరు చూపిస్తోంది ఆఫ్రికా పటం ! అందులో ఢిల్లీ ఎలా వుంటుంది ? ఇదిగో - ఈ ఇండియా పటంలో ఇక్కడ వుంటుంది ఢిల్లీ (అంటూ ఆ పటం తీసికెళ్ళి బోర్డు పక్కన తగిలిస్తాడు)

హెడ్‌మాస్టర్: (వ్యంగ్యంగా) అమ్మయ్య ! ఇందాకట్నుంచీ పిల్లలు ఢిల్లీ ఆఫ్రికా లోనే వుందని ఎక్కడ నేర్చుకుంటారో అని తెగ బాధపడిపోయాను సార్!

డీయివో : ష్ ! పిల్లల ముందు - మనం ఈ విషయాలు మాట్లాడుకుంటే బావుండదు! తర్వాత మీటింగ్‌లో ఈ విషయం ఆయన్తో చెప్దాం లెండి !

హెడ్‌మాస్టర్: (తగ్గు స్వరంతో మాట్లాడుతూ) పాపం ! వారు సైన్స్ టీచరండీ ! సోషల్ తెలీదు ! మాకు సైన్స్ టీచర్స్ అనవసరంగా ముగ్గురున్నారు! రెండు నెలల నుండీ - మాకు సోషల్ స్టడీస్ టీచర్ కావాలని అడుగుతోంది ఇందుకే !

(గంట కొడ్తారు ! రెండో పీరియడ్ అయిపోతుంది - డీయీవో, ఆయన్తో పాటు హెడ్‌మాస్టర్, సోషల్ టీచర్ వెళ్ళిపోతారు. ఆ తర్వాత కాస్సేపటికి డీయీవో వెళ్ళిపోయినట్టు జీప్ శబ్దం విన్పిస్తుంది!)

ఫస్ట్‌లీడర్ : డీయీవో వెళ్ళిపోయినట్టున్నారు ! ఇప్పుడు తెలుగు పీరియడ్ కదా! ఇక మళ్లీ మన తెలుగు టీచర్ లేటుగా వస్తారు!

రవి : అయితే తెలుగు టీచర్ వచ్చేదాకా - మళ్లీ మనందరం ఎంచక్కా మరోసారి ఇన్స్‌పెక్షన్ ఆటాడుకుందాం ! అప్పుడు నాకు డీయీవో ఛాన్స్ మీరివ్వలేదు కాబట్టి - ఇప్పుడు డీయీవో నేను! పోతే... ఇపుడు డీయీవోగా నేను మిమ్మల్ని కొన్ని ప్రశ్నలు అడుగుతాను! మీరు జవాబులు చెప్పాలి ! ఫస్ట్ బెంచీ అమ్మాయి.... నేను తెలుగులో

డిక్టేషన్ చెప్తాను ! ఏదీ - 'సంస్కృతం' అనే పదం బోర్డుమీద రాయమ్మా !

(ఆమె వెళ్ళి బోర్డుమీద రాస్తుంది!)

రవి : గుడ్ ! సెకండ్ బెంచీ అమ్మాయి - ఏదీ నువ్వెళ్లి 'దుర్యోధనుడు' రాయి తల్లీ !

(ఆమె వెళ్ళి 'ధుర్యోధనుడు' అని రాస్తుంది)

రవి : ఏం తల్లీ ! దుర్యోధనుడు ఎంత దుర్మార్గుడైతే మాత్రం మరీ రెండు వొత్తులా ? ఒకటి చాలు ! అయ్యో ! ఇప్పట్లో ఈ దేశం బాగుపడదు... ఈ విద్యార్థులు అంతకన్నా బాగుపడరు!

(ఇంతలో వినోద్ అనే మరో అబ్బాయి లేచి)

వినోద్ : ఎప్పుడూ సోషల్, తెలుగు పాఠాలేనా ? నేనిప్పుడు ఇంగ్లీష్ గ్రామర్... 'నెగెటివ్ సెంటెన్స్' చెప్తాను వినండీ!

(బోర్డుమీద 'షి ఈజ్ దేర్' అని వ్రాసి:)

వినోద్ : షి అంటే ఆమె ! ఈజ్ అంటే వున్నది ! దేర్ అంటే అక్కడ ! షీ ఈజ్ దేర్ ! షి ఈజ్ దేర్ అంటే - ఆమె అక్కడ వున్నది ! దీనికి నెగిటివ్ సెంటెన్స్ షి ఈజ్ నాట్ దేర్ ! ఇపుడు చెప్పండి షి ఈజ్ దేర్ కి నెగిటివ్ సెంటెన్స్ ఏమిటో ?

పిల్లలు : షి ఈజ్ నాట్ దేర్ !

రాము : సర్ ! నాదో డౌట్ !

వినోద్ : ప్రొసీడ్ !

రాము : షి అంటే 'ఆమె' కదా !

వినోద్ : అవునూ....

రాము : ఈజ్ అంటే 'వున్నది' కదా !

వినోద్ : అవునూ....

రాము : నాట్ అంటే 'లేదు' కదా !

వినోద్ : అవునూ....

రాము : దేర్ అంటే 'అక్కడ' కదా !

వినోద్ : (విసుగ్గా) అవునూ... అయితే ఏమిటంట?

రాము : మరి... షి ఈజ్ నాట్ దేర్ అంటే - మీరు ఇందాక చెప్పారు కదా...ఈజ్ అంటే వున్నదీ - నాట్ అంటే లేదూ అనీ - మరి 'షి ఈజ్ నాట్ దేర్' అంటే - ఇంతకీ అమె అక్కడ వున్నట్టా - లేనట్టా !?

(వినోద్ - తల గిర్రున తిరిగి - బుర్ర గోక్కుంటాడు - ఎలా చెప్పాలో అర్థంగాక - తికమక పడ్తుంటే - అప్పడే అ గదిలో కాలెట్టిన

ఇంగ్లీష్ టీచర్.... రాము డౌట్ విని)

ఇంగ్లీష్ టీచర్: చూడు వినోద్ ! ఇంగ్లీష్‌ని ఇంగ్లీష్‌లో కాకుండా తెలుగులో టీచ్ చేస్తే - ఇలాంటి డౌట్స్ రావడం సహజం ! చూడమ్మా ! నీ పేరేమిటీ?

వినీత : వినీత !

ఇంగ్లీష్ టీచర్: షి ఈజ్ వినీత ! నౌ టెల్మీ చిల్డ్రన్ ! ఈజ్ షి సునీతా ?

పిల్లలు : నో - షి ఈజ్ నాట్ సునీత !

ఇంగ్లీష్ టీచర్: షి ఈజ్ వినీత. షీ ఈజ్ నాట్ సునీత !

(ఆ రెండు వాక్యాలూ ఆయన బోర్డుమీద రాసి 'ఈజ్' కిందా 'ఈజ్ నాట్' కిందా అండర్‌లైన్ చేసి)

ఇంగ్లీష్ టీచర్: చూడండి పిల్లలూ.. మొదటి వాక్యంలో 'ఈజ్' - రెండో వాక్యంలో 'ఈజ్ నాట్' కన్పిస్తున్నాయి కదా ! ఈజ్‌కి నెగిటివ్ 'నాట్' కాదు! 'ఈజ్'కీ నెగిటివ్... 'ఈజ్ నాట్' అర్థమైందా !?

పిల్లలు : అర్థమైంది సార్ ! థ్యాంక్యూ వెరీమచ్!

**ఆంధ్రభూమి సచిత్ర వార పత్రిక - తేదీ: 17-1-1991**

**అంకితం**



**శ్రీమతి పి. సుజాత**
M.A.,M.Ed.,M.Phil.,LL.B.
**నిజామాబాదు.**

**ఆ**మెకి - భేషజాలుండవు !

అతిశయాలూ... ఆడంబరాలూ తెలీవు !!

'గుర్తింపు'కోసం తాపత్రయ పడరు !!!

పొరపాటుగానైనా - ఒకర్ని నొప్పించాలని చూడరు !!!!

ఆమె... తన సంస్థలో ఎక్కడేం జరుగుతోందీ -

టక్కున పసిగట్టేస్తారు ! పరనిందలకు పాల్పడకుండా...

పల్లెత్తు మాటనకుండా- పనులు చక్కబెడ్తారు !

టైంటేబుల్ తయారుచేస్తూనో - సబ్సిటిట్యూషన్ వేస్తూనో - అక్విటెన్స్ రాస్తూనో... నిరంతరం బిజీగా ఉండే ఆమె స్పీడ్‌కి - అధునాతన కంప్యూటర్లు సైతం చేతులెత్తేస్తాయి!

**ఆమె... ఓ మలయ మారుతం!** విద్యార్థుల, ఉపాధ్యాయుల అవసరాలను 'అమ్మ'లా గ్రహించి- సకాలంలో స్పందించడం, ఆమెకి వెన్నతో పెట్టిన విద్య!

సదా చిరునవ్వుతో - ఎంతటి పని ఒత్తిడిలోనూ - ఎలాంటి అలసటనీ ప్రదర్శించని విజయ్ హైస్కూల్, నిజామాబాద్, వైస్ ప్రిన్సిపాల్: **శ్రీమతి పి. సుజాత** కి...

ప్రేమతో.... [signature]

1-11-2005